నేడు
మహాత్మా జ్యోతిరావు
పూలే జయంతి

విద్య లేనిదే మానసిక వికాసం లేదు
వికాసం లేనిదే పురోగతి లేదు
పురోగతి లేనిదే ఆర్థిక ప్రగతి లేదు
ప్రగతి లేకనే బీసీలు అధోగతిపాలయ్యారు
ఇన్ని అనర్థాలకు మూలం విద్య లేకపోవడమే
- మహాత్మా జ్యోతిరావు పూలే



నమస్తే తెలంగాణ

## హామీలు, ఆచరణ

'**అమ్మకు** అన్నం పెట్టనివాడు చిన్నమ్మకు బంగారు గాజులు కొనిపెడతానన్నాడట' అనే సామెత కాంగ్రెస్ పార్టీకి అతికినట్టు సరిపోతుంది. ప్రస్తుత ఎన్నికల సీజన్‌లో ఆ పార్టీ హామీలు, గ్యారెంటీలంటూ చేస్తున్న హంగామా ఇంతా అంతా కాదు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలని, తెలంగాణలో ఆరు గ్యారంటీలని ఆశలు కల్పించి అధికారం సంపాదించారు. ఇవికాకుండా లెక్కలేనన్ని హామీలు గుప్పించారు. గెలిచిన తర్వాత హామీల ఎగవేతకు రకరకాల సాకులు వెతుకుతున్నారు. అధికారం మీద యావతో సాధ్యాసాధ్యాలు చూసుకోకుండా హామీలు ఇస్తుండటమే ప్రస్తుత పరిస్థితికి కారణం. తెలంగాణలో ఆరు హామీలు అమలవుతున్నాయా అంటే లేదనే సమాధానం వస్తుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పితే మిగతావన్నీ తుస్సయ్యాయి. ఇదేమని నిలదీస్తే నోటికొచ్చిన సాకు చెప్పి తప్పించుకోజూస్తున్నారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉంటే 'తెలంగాణను ఉద్ధరించాం ఇక దేశమంతటా అభ్యున్నతి సాధిస్తామని' పార్లమెంటు సీట్ల మీద ఆశతో ఊదరగొడుతున్నారు. సంఖ్యల మీది వ్యామోహంతో ఈసారి తమ హామీలకు 'పాంచ్ న్యాయ్' (పంచన్యాయాలు) అని పేరు పెట్టారు.

దేశమంతటా మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామనేది అందులో ఇచ్చిన హామీల్లో ఒకటి. అంటే నెలకు సగటున 8 వేల పైచిలుకే ఇవ్వాల్సి ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల సందర్భంగా మహిళలకు నెలకు రెండున్నర వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటిదాకా దాని అతీగతీ లేదు. 30 లక్షల ఉద్యోగాల భర్తీ అనేది మరో హామీ. తెలంగాణలో ఫిబ్రవరి 1 నుంచి జాబ్ క్యాలెండర్ అన్నారు. క్యాలెండర్‌లో నెలలు మారుతున్నాయి కానీ ఇంతవరకు కాంగ్రెస్ హామీ ఇచ్చిన క్యాలెండర్ మాత్రం ఇంకా గోడమీదికి రాలేదు. మరోవైపు కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి అంతా సిద్ధం చేసిన 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలను అట్టహాసంగా పంపిణీ చేసి అదంతా తమ గొప్పే అన్నట్టుగా ప్రచారం చేసుకున్నారు. దేశంలో 30 లక్షల ఉద్యోగాలకూ ఇదే గతి పడుతుందా? కాంగ్రెస్ హామీల అమలు ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే రుణమాఫీ విషయాన్ని పరిశీలిస్తే చాలు. 'రైతులు రుణాలు చెల్లించొద్దు మేం చూసుకుంటాం' అని ప్రగల్భాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక రుణదాతలు రైతులను నానా బాధలు పెడుతుంటే తమాషా చూస్తున్నారు. ఇప్పుడు దేశమంతటా రుణమాఫీ అంటున్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీల అమలుకు ఇప్పుడున్న రాష్ట్ర బడ్జెట్ మూడింతలు కావాల్సి ఉంటుందని ఆర్థిక నిపుణులు ఎప్పుడో తేల్చేశారు.

ఇప్పుడు దేశం మీదికి వదులుతున్న హామీల మాటేమిటి? కాంగ్రెస్ హామీల అమలుకు, దేశ ఆర్థిక పరిస్థితికి మధ్య అసలు పొంతన అనేది ఉన్నదా? హామీలిచ్చే ముందు వ్యయంపై అంచనాలు ఏమైనా వేసుకున్నారా? అంటే అలాంటి సూచనలేవీ కనిపించడం లేదు. హామీలు నిజంగా అమలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే లెక్కలు వేసుకుంటారు. కానీ కాంగ్రెస్ అలా కాదు, బండి వెనకాల గుర్రాన్ని కట్టినట్టుగా ఉంటుంది ఆ పార్టీ ధోరణి. హడావుడిగా హామీలిచ్చి ఆ తర్వాత తీరికగా వాటి అమలు గురించి ఆలోచించడం ఆ పార్టీకి పరిపాటిగా మారింది. తెలంగాణలో సాకులు చెప్పి తప్పించుకున్న అనుభవం చాలానే ఉన్నది. లంకె బిందెలు ఉంటాయనుకుంటే ఖాళీ ఖజానా తమ చేతికి వచ్చిందని చెప్పలేదా? ఇక నిరుద్యోగ భృతి హామీ అయితే అసలు తాము ఇవ్వనేలేదని అసెంబ్లీ సాక్షిగా బుకాయించడం మనం చూడలేదా? జాతీయ పార్టీగా చెప్పుకొనే కాంగ్రెస్‌కు దేశాభివృద్ధికి సంబంధించిన ఎజెండా అనేది లేదు. ఆ అభివృద్ధి ఫలాలు దేశ ప్రజలకు ఎలా పంపిణీ చేస్తారన్న వివరణ అసలే లేదు. కేవలం ఉచితాలు, ఊరింపులతో బురిడీ కొట్టించాలన్నదే కాంగ్రెస్ ఆలోచన అని హామీలను చూస్తే అర్థమైపోతుంది. అందరినీ అన్నిసార్లూ మోసం చేయడం కుదురుతుందా? అనేది అసలు ప్రశ్న.

# మాటల గారడీని మళ్లీ నమ్మవద్దు!

దేశంలో ఎన్నికల నగారా మోగింది. తమ తమ మ్యానిఫెస్టోలను ప్రకటించి మరొకసారి దేశ ప్రజలను మోసం చేసేందుకు రాజకీయ పార్టీలు తహతహలాడుతున్నాయి. గత ఏడు దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలు ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. ఈ తరుణంలో దేశవ్యాప్తంగా పలు వేదికలపై నిరుద్యోగం, పేదరికం, ఆదాయ అసమానతలపై చర్చ సాగుతున్నది. ఈ వ్యవస్థాపూర్వక సమస్యల పట్ల అనేక సంస్థలు అధ్యయనం చేస్తున్నాయి. ఆ సంస్థలు విడుదల చేసిన లెక్కలను చూస్తుంటే కడుపు తరుక్కుపోతున్నది. కేంద్ర గణాంక శాఖ తాజాగా విడుదల చేసిన లెక్కల ప్రకారం... జాతీయస్థాయిలో సగటు నిరుద్యోగిత రేటు 16.5 శాతం ఉండగా, రాష్ట్రంలో నిరుద్యోగిత రేటు (15-29 ఏండ్ల యువత) 22.9 శాతంగా ఉన్నది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో నిరుద్యోగిత రేటును పరిశీలిస్తే.. రాష్ట్ర ర్యాంకు చివరి నుంచి ఆరో స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే పరిణామం.

అభివృద్ధిలో మనకన్నా అత్యంత వెనుకబడిన యూపీ, ఉత్తరాఖండ్, వెస్ట్ బెంగాల్, బీహార్ రాష్ట్రాల గణాంకాలు తెలంగాణ కన్నా మెరుగ్గా ఉన్నాయి. రాష్ట్రంలో కార్మిక బలగంలోకి వచ్చే మహిళల సంఖ్య కూడా తగ్గుతున్నది. చదువుకున్న యువతులు ఇంటికే పరిమితం అవుతుండగా, మరోవైపు సరైన అవకాశం లేకపోవడం, ఉన్నా ఇంటి బాధ్యతలు, వివాహాలు, ప్రసూతి కారణాలతో మహిళలు ఉద్యోగాలు వదిలిపెడుతున్నారని ఈ గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి లాంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ఈ దేశంలో ఉన్న నిరుద్యోగంపై చాలా దారుణమైన లెక్కలు చూపిస్తున్నాయి. ఇవన్నీ పక్కనపెడితే ఈ దేశంలో అసలు నిరుద్యోగిత ఎందుకు ప్రబలింది? ఇప్పటివరకు పాలక పార్టీలు అనుసరించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక విధానాలు ఏమిటి? అవి ఎంత మేర కారణమయ్యాయో ఒకసారి లోతుగా పరిశీలిద్దాం.



పొందూరు ప్రభాకర్‌రావు
90106 31727




స్వాతంత్ర్యానికి పూర్వం.. 1922లో దేశీయంగా ఒక శాతం సంపన్నులచేతిలో 13 శాతం జాతీయాదాయం ఉండేది. 1951లో అది 11 శాతానికి తగ్గింది. అయినా నాడు దేశంలోని సగం జనాభా వద్ద 20.6 శాతం మాత్రమే జాతీయాదాయం ఉండేది. 1951లో దేశంలో నిరుద్యోగ రేటు 4.5 శాతం మాత్రమే. కానీ, దేశంలో ధరల పెరుగుదల రేటు 13 శాతంగా ఉన్నది. పేదరికం 45.3 శాతంగా ఉన్నది. ఈ సమస్యలను అధిగమించడం కోసమే మనం సోషలిస్టు ఆర్థిక విధానాన్ని ఎంపిక చేసుకోవాలని 1956లో ఆర్థిక రాజ్యాంగ తీర్మానాన్ని ఆమోదించారు. కానీ అనుకున్నదొక్కటి అయినది మరొకటి. ముఖ్యంగా నిరుద్యోగం విపరీతంగా పెరుగుతూ వస్తున్నది. పాకిస్థాన్ ప్లానింగ్ కమిషన్ ముఖ్య ఆర్థికవేత్తగా ఉన్న హబీబ్ ఉల్ హక్ మూడో ప్రపంచ దేశాల ఆర్థిక ప్రణాళిక గురించి.. 'ఉద్యోగ లక్ష్యం మారు బిడ్డ (సవితి బిడ్డ) వంటిది' అని వ్యాఖ్యానించారు. మన దేశంలో 1959 సెప్టెంబర్ 28న చండీగఢ్‌లో ఏర్పాటు చేసిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ... సంఘటిత ప్రణాళికలో ముఖ్యమైన అంశం ఉత్పత్తియే కానీ, ఉద్యోగిత కాదు. ఉత్పత్తితో పోల్చి చూసినప్పుడు ఉద్యోగిత ముఖ్యం కాదు. ఉద్యోగిత ఉత్పత్తిని అనుసరించేదే కానీ, అధిగమించేది కాదు. ఉత్తమ సాంకేతిక పద్ధతుల ద్వారానే ఉత్పత్తి అధికం అవుతుంది' అని చెప్పారు. అందుకే రెండో ప్రణాళికలో భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చారు.

4వ ప్రణాళిక కాలం నుంచి మన దేశంలో టార్గెట్ గ్రూపు ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌ను చేపట్టి ఉపాధి అవకాశాలు కల్పించాలని అనేక పథకాల్లో ఖర్చుచేసే మొత్తంలో అట్టడుగు వర్గాలకు చేరేది కేవలం 20 శాతం అని స్వయంగా ఒక ప్రధాన మంత్రి చెప్పారు. ఈ పథకాల వల్ల మన దేశంలో ప్రణాళిక పెట్టుబడి తగ్గిపోయి ఉద్యోగిత అంతగా పెరగలేదు.

పేదవానికి చేపలు పట్టిస్తున్నారు. పట్టి ఇవ్వడం పరాధీనత. పట్టడాన్ని నేర్పడం స్వావలంబన. సాంకేతిక విద్యపై అభివృద్ధి చెందిన దేశాలు 15 శాతం ఖర్చు చేస్తుండగా, మన దేశంలో ఇది మొన్నటివరకు 3 శాతం మాత్రమే. అందుకే నిరుద్యోగిత. నిరుద్యోగితకు కారణం జనాభా కొంతమంది అంటున్నారు. అయితే, జనాభా వల్ల పేదరికం పెరిగిందా? లేక పేదరికం వల్ల జనాభా పెరిగి అది నిరుద్యోగితకు కారణమైందా? అన్న మౌలిక సత్యాన్ని గ్రహించడం లేదు. అవిద్య, పేదరికం కారణంగా మన దేశంలో నిరుద్యోగిత పెరిగింది. ఇది ప్రభుత్వాల వైఫల్యమే.

ప్రపంచబ్యాంకు లెక్కల ప్రకారం.. అనేక బహుళజాతి సంస్థలు కల్పిస్తున్న ఉద్యోగిత ప్రపంచ జనశక్తిలో 3 శాతం మాత్రమే. ప్రస్తుతం ఆర్థికవ్యవస్థ సామర్థ్యం పెంపుకోసం పాలకులు ఆహ్వానిస్తున్న ఈ బహుళజాతి సంస్థలు మన దేశంలో ఈ నిరుద్యోగాన్ని పరిష్కరిస్తున్నాయా? అంటే దీనికి పాలకులే సమాధానం చెప్పాలి? మన దేశంలో ప్రణాళికల ప్రారంభం నుంచి ఉద్యోగ అవకాశాల కల్పన ప్రధానంగా ఉన్నది. మొదటి ప్రణాళికలో ఊరిలో ఉన్న మానవశక్తిని పూర్తిగా వినియోగించుకోవాలని, రెండవ ప్రణాళికలో ఆర్థిక, సాంఘిక దృష్టితో చూస్తే ఉద్యోగ అవకాశాల విస్తరణ లక్ష్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, నాలుగో ప్రణాళికలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎప్పటికీ పెరిగే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆరవ ప్రణాళికలో ఈ సమస్యను తగ్గించకపోవడం వల్ల సాధించిన అభివృద్ధి అంతా మరుగున పడిపోతుందని, ఏడవ ప్రణాళికలో కూడా ఈ సమస్య పరిష్కారానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. కానీ, సాధించిన ఫలితాలు అంతగా లేవు. 1990లో బీఓపీలో లోటు రూ. 10,664 కోట్లు ఉండటం మూలంగా అప్పులు పుట్టని స్థితి వచ్చింది. సంస్థాగత సర్దుబాటు పద్దు కింద ఐఎంఎఫ్ నుంచి అప్పు తీయడంతో ప్రైవేటీకరణ అన్నిరంగాల్లో మొదలైంది. పబ్లిక్‌రంగ ప్రాధాన్యం ఉన్న సమయంలోనే ఉద్యోగిత అంతగా పెరగలేదు. మరి ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు పెరిగే అవకాశం ఏది? 1991-92 ఆర్థిక సర్వేలో ప్రభుత్వరంగంలో వార్షిక ఉద్యోగిత పెరుగుదల 2.78 శాతం ఉండగా, ప్రైవేట్‌రంగంలో వార్షిక ఉద్యోగిత పెరుగుదల - 10 శాతంగా ఉన్నట్టు వెల్లడైంది. ఇది మూలిగే నక్కపై తాటిపండు చందంగా మారింది.

8వ ప్రణాళికలో 58 మిలియన్ల మంది ప్రజలకు ఉద్యోగం కల్పించాలని ప్రణాళిక సంఘం అంచనా వేసింది. అయితే ఒక్క ఈ ప్రణాళికలో వార్షిక ఉద్యోగిత పెరుగుదల 4 శాతంగా ఉండాలని చెప్పారు. కానీ ప్రభుత్వరంగ ప్రాధాన్యం ఎక్కువగా ఉన్నప్పుడే ఇంత ఉద్యోగిత లేదు. ఈ ప్రైవేటీకరణలో ఇది సాధ్యం కాలేదు. అందుకే ఈ నిరుద్యోగిత. ఈ ప్రైవేటీకరణకు పునాదులు వేసింది ఎవరో దేశ ప్రజలకు స్పష్టంగా తెలుసు.

ఇక తెలంగాణ విషయానికి వస్తే.. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన నినాదం. ఈ నియామకాల్లో కూడా కేవలం ఒక కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయని, ఈ నిరుద్యోగుల ఘోష మీకు శాపనార్థం అవుతుందని మొన్నటి రాష్ట్ర ఎన్నికల్లో కొందరు దుష్ప్రచారం చేశారు. పైగా ఊరూరా బస్సు తిప్పి కొంతమంది మేధావులతో పదే పదే పల్లెల్లో వల్లె వేయించారు. కానీ వాస్తవానికి ప్రభుత్వ రంగంలో ఈ తొమ్మిదేండ్ల కాలంలో లక్షా 35 వేల ఉద్యోగాలను ప్రభుత్వం కల్పించింది. ప్రైవేట్‌రంగంలో తీసుకున్న శ్రద్ధ వల్ల సుమారు 20 లక్షల ఉద్యోగాలు యువతకు లభించాయి. ఇంకా ఉద్యోగాలివ్వాలని, గ్రూపు-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 నోటిఫికేషన్లను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ప్రజల సంక్షేమం కన్నా తమ అధికారమే మిన్న అన్నది రాజకీయ సూత్రనానుడి. అందుకే గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని ధర్నాలు, రాస్తారోకోలు చేసి నిరసనలు చేశారు అప్పటి ప్రతిపక్ష నాయకులు. గ్రూపు-1 పరీక్ష విషయంలో సాంకేతికమైనటువంటి లోపాన్ని ఆసరా చేసుకొని హైకోర్టును ఆశ్రయించారు. తద్వారా ఎమ్మెల్సీ పదవిని సైతం పొందింది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు కర్రు కాల్చి వాత పెడతారు. కాలమే అన్నిటికీ సమాధానం చెప్తుంది. అధికారం కోసం ఈ గోడ దూకే పిల్లులు చెప్పే మాటల గారడీలను నమ్మవద్దు, నమ్మి మరొక్కసారి మోసపోవద్దు.

ఇక తెలంగాణ విషయానికి వస్తే.. నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన నినాదం. ఈ నియామకాల్లో కూడా కేవలం ఒక కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయని, ఈ నిరుద్యోగుల ఘోష మీకు శాపనార్థం అవుతుందని మొన్నటి రాష్ట్ర ఎన్నికల్లో కొందరు దుష్ప్రచారం చేశారు. పైగా ఊరూరా బస్సు తిప్పి కొంతమంది మేధావులతో పదే పదే పల్లెల్లో వల్లె వేయించారు. కానీ వాస్తవానికి ప్రభుత్వ రంగంలో ఈ తొమ్మిదేండ్ల కాలంలో లక్షా 35 వేల ఉద్యోగాలను ప్రభుత్వం కల్పించింది. ప్రైవేట్‌రంగంలో తీసుకున్న శ్రద్ధ వల్ల సుమారు 20 లక్షల ఉద్యోగాలు యువతకు లభించాయి.

మెదడుకు పదునుపెట్టి, శాస్త్రీయంగా ఆలోచించండి. ఈ నిరుద్యోగానికి శాశ్వత పరిష్కారం జనశక్తి ప్రణాళికలే. ఉద్యోగం అంటే పని కానీ, ప్రభుత్వం ఇచ్చేదే ఉద్యోగం అనే భావనలో మార్పు రావాలి. అప్పుడే స్వయం సంపూర్ణత కలిగిన గ్రామీణ, ఆర్థిక వ్యవస్థను మనం నిర్మించుకొని గత వైభవాన్ని చాటుకోవచ్చు.

(వ్యాసకర్త: ఆర్థిక శాస్త్ర నిపుణులు)

# రైతు ఆత్మహత్యలపైనా అబద్ధాలా?

తెలంగాణలో గత నెల రోజులుగా రాజకీయ పార్టీలన్నీ రైతు ఆత్మహత్యలపైన రాజకీయం చేస్తున్నాయి. భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... 'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోలేద'ని మాట్లాడటం హాస్యాస్పదం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతు ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉన్నది. ఇవి రైతు ఆత్మహత్యలు కావనడం రైతుల చావులను అవమానించినట్టేనని తెలంగాణ సమాజం అనుకుంటున్నది.



పులి రాజు
99083 83567

గతంలో కూడా ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, కొందరు కేంద్ర మంత్రులు కూడా రైతు ఆత్మహత్యలను అవహేళన చేస్తూ మాట్లాడింద్రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ముందు తెలంగాణలో రైతుల ఆత్మహత్యలున్నాయన్న అప్పటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు లేవనడం రైతుల పట్ల నాయకులకు, ప్రభుత్వానికి చిన్న చూపు ఉన్నట్టు లెక్క! ఒక బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి అబద్ధాలు మాట్లాడటం మంచిది కాదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రభుత్వంలోకి వచ్చినంక ఇంకొక మాట... ఈ రెండు నాలుకల ధోరణి సరైనది కాదు.

సిద్దిపేట జిల్లా తొగుట మండలం వరదరాజుపల్లి గ్రామానికి చెందిన కంతుల పాపయ్య తనకున్న ఆరెకరాల వ్యవసాయ భూమిలో గత 13 ఏండ్లుగా మూడు బోర్లు వేసుకొని రెండు పంటలు పండించుకుంటున్నాడు. రెండు బోర్లు ఎండిపోవడంతో టమాట పంట ఎండిపోతున్నదని, ఆ పంటను కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 5న వరుసగా 600 ఫీట్ల చొప్పున నాలుగు బోర్లు తవ్వించాడు. ఇందుకోసం రూ. 3,85,000 లు ఖర్చు కాగా చుక్క నీళ్లు పడకపోవడంతో అప్పులపాలయ్యాడు. దీంతో పాపయ్య దిక్కుతోచని స్థితిలో పడ్డాడు.

కామారెడ్డి జిల్లాకు చెందిన దోమకొండ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన బొబ్బిలి దుర్గయ్య అనే దళిత రైతు తనకున్న రెండెకరాల భూమిలో రెండు బోర్లు ఎండిపోయాయి. దీంతో జనవరి 20న నాలుగు బోర్లు వేయించాడు. అయినా చుక్క నీరు రాకపోవడంతో ఉన్న పంట ఎండిపోవడం, అప్పుల పాలు కావడంతో వేరే మార్గం లేక దిక్కుతోచని స్థితిలో దుర్గయ్య 2024, జనవరి 28న ఆత్మహత్య చేసుకున్నాడు. పైవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

అటు ప్రతిపక్షమైనా, ఇటు ప్రభుత్వమైనా రైతుల బతుకులకు భరోసానిచ్చే విధంగా మాటలు మాట్లాడాలే తప్ప, ఆత్మహత్యలకు పాల్పడే మాటలు మాట్లాడటం మంచిది కాదు.

ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రభుత్వాలు మారినంత మాత్రాన రైతుల ఆత్మహత్యలు ఆగవు. భారతదేశం వ్యవసాయక దేశం నూటికి 65 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు దాటిన ఇప్పటికీ దేశంలో ఒక వ్యవసాయ విధానం అంటూ లేకపోవడం చాలా దురదృష్టం. వ్యవసాయ విధానం లేకపోవడంతో దేశవ్యాప్తంగా 1995 నుంచి 2022 వరకు సుమారు 4 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు ఎన్‌సీఆర్‌బీ నివేదికలు తెలుపుతున్నాయి.


ఉమ్మడి ఏపీలోని తెలంగాణ ప్రాంతంలో పదేండ్లలో ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం రైతు ఆత్మహత్యల వివరాలు..

| | |
|---|---|
| 2004 | 2030 |
| 2005 | 1802 |
| 2006 | 1932 |
| 2007 | 1071 |
| 2008 | 1575 |
| 2009 | 1213 |
| 2010 | 1536 |
| 2011 | 1316 |
| 2012 | 1576 |
| 2013 | 2014 |
| 2014 | 449 |
| మొత్తం | 16,494 |

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేండ్లలో జరిగిన రైతు ఆత్మహత్యల వివరాలు..

| | |
|---|---|
| 2014 | 898 (02-06-2014 నుంచి) |
| 2015 | 1400 |
| 2016 | 645 |
| 2017 | 851 |
| 2018 | 908 |
| 2019 | 499 |
| 2020 | 471 |
| 2021 | 352 |
| 2022 | 178 |
| (ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం) | |
| 2023 | 215 |
| 2024 | 61 (08-04-2024 నాటికి) |
| మొత్తం | 6,478 |

పైన ఉన్న గణాంకాలు చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కన్నా బీఆర్‌ఎస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గినట్టు స్పష్టం అవుతున్నది. కానీ ఈయేడు యాసంగి పంట ప్రతి గ్రామంలో సుమారు 20 శాతం పంటలు ఎండిపోవడం మనం చూస్తూనే ఉన్నాం. రాష్ట్ర రైతాంగం మళ్లీ పదేండ్ల తర్వాత పంటలు ఎండిపోతుండటంతో వాటిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో అప్పులు చేసి బోర్లు వేస్తున్నారు.



బోర్లల్లోనూ నీళ్లు పడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పదేండ్ల తర్వాత బోరు బండ్లు తెలంగాణలో రాత్రి, పగలు పంట పొలాల్లో కనిపిస్తున్నాయి. పదేండ్ల తర్వాత మోటర్ వైండింగ్ షాపులు తెరుచుకుంటున్నాయి. తెలంగాణలో కరువు ఘంటికలు మోగుతున్నాయనడానికి ఇవి సూచికలు. ఈ కరువు కాంగ్రెస్ తెచ్చిన కరువా? ప్రకృతి తెచ్చిన కరువా? అనేది పక్కనపెట్టి ఇప్పుడు రైతాంగానికి బతుకుపై భరోసా కల్పించాలి. ప్రస్తుతం రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన ప్రధాన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. డిసెంబర్ 9న రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు రైతులను డిఫాల్టర్స్‌గా చూపిస్తూ నోటీసులు పంపిస్తున్న సంగతి మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. నీటి కరువు ఒక వైపు, అప్పుల భారం ఒకవైపు, ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు... వెరసి రైతును కుంగదీస్తూనే ఉన్నాయి. దీంతో భవిష్యత్తు మీద భరోసా లేక అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలుచేసి నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. పండిన ప్రతి గింజను మద్దతు ధరతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ ఇవ్వాలి. ఇప్పటికైనా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు జీవో ఎంఎస్ నెంబర్ 194 ప్రకారం ప్రతి కుటుంబానికి రూ.6 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వానికి రైతాంగం విజ్ఞప్తి చేస్తున్నది.

ఈ కరువు పరిస్థితులను చూస్తుంటే భవిష్యత్తులో రైతుల ఆత్మహత్యలు పెరిగే అవకాశం ఉన్నది. కాబట్టి రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీ, పౌర సమాజంపైన ఉన్నది. రైతన్నలారా... ఎవరు కూడా అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దు.. మీకు తెలంగాణ సమాజం అండగా ఉన్నది.

(వ్యాసకర్త: సామాజిక కార్యకర్త)

ప్రపంచవ్యాప్తంగా మెజారిటీ ప్రజలను ఆలోచింపజేసి, ప్రేరణ కలిగించిన వ్యక్తులు ఇద్దరే ఇద్దరు. ఒకరు కార్ల్‌మార్క్స్ అయితే, మరొకరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్. వీళ్లను ప్రభావితం చేసిన మహోన్నతమైన వ్యక్తి గౌతమ బుద్ధుడు. మార్క్స్ జర్మనీలో జన్మించగా, మన దేశంలో నిచ్చెనమెట్ల వ్యవస్థలో చిట్టచివరకు విసిరేయబడిన నిమ్నకులంలో అంబేద్కర్ జన్మించారు. వీరిద్దరూ దేశ, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అక్కడి అసమానతలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాటం చేశారు.

# అంబేద్కర్ వల్లనే బలమైన రాజ్యాంగం



పీసీ వీరస్వామి
94944 46262

దేశంలో నెలకొన్న అసమానతలు, అవమానాలు ఎదురైనా అంబేద్కర్ నిరంతరం ఎదురొడ్డి పోరాడి నిలిచాడు. ప్రస్తుతం కుల సమస్య తగ్గినట్టుగా కనపడుతున్నా మౌలికంగా తన అసలు స్వరూపాన్ని మాత్రం మార్చుకోలేదనే విషయాన్ని గ్రహించాలి. కుల వ్యతిరేక పోరాటాలు ఎన్ని వచ్చినా భారత సామాజిక జీవనంలో కుల తత్వం లోతుగా పాతుకుపోయింది. చదువును, సంస్కృతిని ఆయుధంగా మలుచుకొని ఎదిగిన జ్ఞాన సైనికుల ద్వారానే రాజ్యాధికార కాంక్షతో కులరహిత సమాజం, ఆ తర్వాత సమసమాజం సాధ్యమవుతుంది. ప్రపంచ మేధావిగా, జ్ఞానయోధులుగా పేరొందిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని ఏప్రిల్ 14న విశ్వవ్యాప్తంగా జరుపుకొంటారు. కులం, మతం, జాతి, ప్రాంతం, వివక్షలతో సంబంధం లేకుండా అతిపెద్ద ఉత్సవంగా అంబేద్కర్ జయంతి జరగడం సంతోషం.

**రాజ్యాంగం ద్వారానే హక్కులు:** అడగందే అమ్మ అయినా అన్నం పెట్టదంటారు. మన దేశంలో అంబేద్కర్ పుట్టకుంటే, గొప్ప రాజ్యాంగాన్ని అందించకుంటే పేదల బతుకుల్లో ఈ మాత్రమైనా వెలుగులు ఉండేవి కావు. బ్రిటిష్ కంటే ముందు మనువాదమే రాజ్యాంగంగా చలామణి అయ్యింది. బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియులకు తప్ప.. మిగిలిన కులాల, జాతుల ప్రజలకు ఎలాంటి హక్కులు ఉండేవి కావు. మనిషిని మనిషిగా కూడా గుర్తించలేదు. మహిళలు అయితే బానిసలకే బానిసలుగా బతికారు. స్త్రీలకు నేడు ఆస్తి, విద్య, రిజర్వేషన్లు లభించాయంటే అవి పెరియార్, పూలే, అంబేద్కర్ వంటి మహనీయుల త్యాగాల ఫలితమే. భారతీయ మూలవాసులకు జీవించే హక్కుతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, అస్తిత్వం, ఆత్మగౌరవాలు దక్కాయంటే అది రాజ్యాంగం కల్పించిన వరం. 1950 కంటే పూర్వం భూమ్మీద ఎవరికీ చట్టబద్ధమైన హక్కుల్లేవు. అలాంటిది రాజ్యాంగాన్ని అంబేద్కర్ రచించడం కారణంగానే భారతీయ మూలవాసులకు భూమిపై హక్కు పత్రాలు వచ్చాయి. రాజ్యాంగం ద్వారానే కాస్రా పహణి చట్టబద్ధంగా వచ్చింది. భూమి ఆధారంగా జీవిస్తున్న శూద్రులకు (కమ్మ, రెడ్డి, వెలమ, కాపు తదితరులతో పాటు, బీసీ, ఎస్సీ, ఎస్టీ) భూమిపైన హక్కులు వచ్చాయంటే అందుకు అంబేద్కర్ కృషే కారణం. సమస్త భారతీయులకు సామాజిక న్యాయం దక్కాలని జీవితాంతం పోరాడిన గొప్ప వ్యక్తి అంబేద్కర్. ఎందుకంటే తాను అనుభవించిన అసమానతలతో దేశ ప్రజలు భవిష్యత్తులో ఇబ్బందులు పడకూడదని భావించాడు. వాస్తవానికి ఆయన్ను మనమేం అడగలేదు. ఆయనకు మనం ఎలాంటి వినతిపత్రాలు ఇవ్వలేదు. కానీ, అంబేద్కర్ మాత్రం మనకు సమస్త సమస్యలకు పరిష్కారం చూపించే రాజ్యాంగాన్ని అందించాడు. కోరితే వరాలు ఇస్తారనే వారి ఫొటోలు ప్రతి ఇంట్లో ఉంటాయి. మనం అడగకుండానే వరాలు ఇచ్చిన అంబేద్కర్‌ను విస్మరించడం వివక్ష కాదా? అందరివాడిని కొందరివాడిగా చిత్రించారు. ఇదే నయా వివక్ష.



**రష్యా, అమెరికాలో విఫలమైన రాజ్యాంగం:** భారత రాజ్యాంగంలో అభాగ్యులకు, అనాథలకు, పరాజితులకు అవకాశాలతో పాటు అస్తిత్వం, ఆత్మగౌరవం పెంపొందేలా అంబేద్కర్ కృషిచేశారు. సమస్త ప్రజానీకానికి జనాభా దామాషా ప్రకారం సామాజిక న్యాయాన్ని పొందుపర్చారు. ఇది కచ్చితంగా రాజ్యాంగం గొప్పతనమే. ప్రపంచంలోని అనేక దేశాల్లో విఫలమైన రాజ్యాంగాలున్నాయి. సోవియెట్ యూనియన్‌లో సోషలిస్టు రాజ్యాంగం అనతికాలంలోనే విఫలమైంది.

ఫలితంగానే సోవియట్ యూనియన్ ముక్కచెక్కలైంది. ఆయా దేశాల రాజ్యాంగం.. ఆ దేశాలను ఐక్యంగా ఉంచలేకపోయింది. భారత్‌లో విభిన్నమైన కులాలు, మతాలు, జాతులు ఉన్నప్పటికీ అనేక సంస్థానాలు కలిసి భారతీయ సమాజంగా ఏర్పడినా భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపడానికి కారణం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగస్ఫూర్తి మాత్రమేనని బలంగా చెప్పగలం. ఇంతటి మహత్తరమైన రాజ్యాంగాన్ని మార్చే కుట్రకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, దాని మిత్రపక్షాలు చాపకింద నీరులా ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి. ఈ విషయంలో సెక్యులరిస్టులు, అంబేద్కరిస్టులు, ప్రజాస్వామికవాదులు, అణగారిన సమస్త వర్గాలు ఐక్యంగా మతోన్మాద పార్టీలకు వ్యతిరేకంగా నిలబడాల్సిన చారిత్రక ఆవశ్యకత ఉన్నది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అందుకు ప్రతిజ్ఞ చేద్దాం.

(వ్యాసకర్త: ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు)